వన్నె తగ్గని.. పేదవాడి ఫ్యాన్





మేదరవీధిలో విసనకర్రలు విక్రయిస్తున్న వ్యాపారి

అనాది కాలం నుంచి ప్రాభవం కోల్పోని విసనకర్రలు

విద్యుత్ లేని సమయంలో చల్లగా సేవలు

చిరువ్యాపారులకు అంతో ఇంతో ఉపాధి

జగదాంబ: ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వాడుతున్న ఈ ఆధునిక కాలంలో కూడా మనకు పలు చోట్ల తాటాకు విసనకర్రలు కనిపిస్తాయి. పేదవాడి ఫ్యాన్‌గా పిలవబడే విసనకర్రలకు ఎంతో చరిత్ర ఉంది. రాజుల కాలం నుంచే విసనకర్రలు ఎంతో ప్రాశస్త్యం పొందాయి. అనేక పాత జానపద చిత్రాల్లో రాజుకు రెండు పక్కలా వింజామరలు (విసనకర్రలు) పట్టుకుని అంతఃపుర కన్యలు గాలి విసిరే సీన్లను మనలో చాలా మంది చూసే ఉంటారు. అలాగే చైనీస్ సినిమాల్లో కూడా ప్రతివారి చేతిలో విసనకర్రలు ఉండడాన్ని గమనిస్తాం. విసనకర్రలు అంతటి ప్రాచుర్యం పొందాయి

విసనకర్రల తయారీ ఇలా..

చిన్నగా ఉన్న పచ్చి తాటాకు అంచులను గుండ్రంగా కత్తిరించి మూడవ భాగాన్ని తొలగిస్తారు. దానికి అంచుల పక్కగా పచ్చి ఈనెను ఆధారంగా అల్లుతారు. తర్వాత అంచుకు చిన్న గుడ్డను రెండు వైపులా వచ్చేలా సూదితో కుడతారు. కింద తాటాకు కాడను చేతికి అనువుగా ఉండేలా కత్తిరిస్తారు. అదే హ్యాండిల్‌లా ఉపయోగపడుతుంది. విసనకర్రను కేవలం తాటాకులతోనే కాకుండా వెదురుబద్దలు, వట్టి వేరు మొదలైన ఇతర పలుచని సామగ్రితో కూడా తయారు చేస్తారు.

అందరి ఎంపిక ఇదే..

ఎండా కాలంలో.. మరీ ముఖ్యంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు అందరూ వాడేది విసనకర్రలనే. ప్రస్తుత ఎండలు, ఉక్కబోతకు ఇంట్లో ఫ్యాన్లు ఉన్నప్పటికీ పెద్ద వయసు వారు విసనకర్రలనే ఆశ్రయిస్తున్నారు. వృద్ధులు, చిరు వ్యాపారులు, ఆస్పత్రుల్లో బెడ్‌మీద ఉండేవాళ్లు విసనకర్రలనే వినియోగిస్తున్నారు. అదే విధంగా ఊయలలో ఉండే చిన్నారులకు ఫ్యాన్ గాలి తగలకపోతే తల్లులు ఊయల దగ్గరగా నిలబడి విసనకర్రతోనే విసురుతుంటారు. తేలిగ్గా, చేతిలో సులభంగా ఇమిడిపోయే విసనకర్రల వినియోగం శ్రమ లేనిది కావడంతో ఇది తరతరాలుగా మన్నికలో ఉందని చెప్పొచ్చు.

విసనకర్రల్లో రకాలు

- తాటాకు విసనకర్రలు
- ప్లాస్టిక్ విసనకర్రలు
- ఇనుపరేకు విసనకర్రలు
- పల్చని చెక్కపేడు విసనకర్రలు
- జనపనార విసనకర్రలు



విసనకర్రతో విసురుకుంటున్న వ్యక్తి



వెలంపేటలో విక్రయానికి సిద్ధంగా విసనకర్రలు

పలు ప్రాంతాల నుంచి వస్తున్న విసనకర్రలు..

వేసవిలో విసనకర్రలు పెద్ద ఎత్తున నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తుంటారు వ్యాపారులు. కొత్తవలస, విజయనగరం, జొన్నాడ, తగరపువలస, ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం, తుని, అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి వంటి ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వీటిని తీసుకొచ్చి టోకున ఇక్కడి వ్యాపారులకు విక్రయించడం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఆ విసనకర్రల మీద కొంత లాభం వేసుకుని ఇక్కడి వ్యాపారులు వినియోగదారులకు విక్రయిస్తున్నారు.

రూ. 10 నుంచి మొదలు..

విసనకర్రల ధరలు రూ. 10 నుంచి ప్రారంభం అవుతున్నాయి. అంత కంటే ఎక్కువ ధరకు కూడా పలు రకాల ఫ్యాన్సీ విసనకర్రలు మార్కెట్లో దొరుకుతుంటాయి. అవి పలు ఆకృతుల్లో లభ్యమవుతున్నాయి. ఏది ఏమైనా పేదవాడి పంకాకు ఏ కాలంలోనూ తిరుగు లేదని విసనకర్రలు ఇప్పటికీ చాటి చెబుతున్నాయి.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జిని కలిసిన మంచా



చిన్న శ్రీనుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంచా నాగమల్లేశ్వరి

డాబాగార్డెన్స్: గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పని చేయాలని భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్న శ్రీను పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి గురువారం చిన్న శ్రీనును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రాజ్యలక్ష్మి, పి. శ్రీనివాసరెడ్డి, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని సంరక్షించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న చలపతిరావు

మల్కాపురం: ప్రకృతిలో ప్రతి జీవికీ ప్రాధాన్యం ఉందని కళారత్న సుంకర చలపతిరావు తెలిపారు. వాటన్నింటినీ కాపాడుకోవల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. జీవ వైవిధ్యం వలన ఆహార భద్రత ఏర్పడుతుందన్నారు. వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, పశు పోషణ, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. వాతావరణ మార్పులను తట్టుకునే శక్తి జీవ వైవిధ్యం ఇస్తుందన్నారు. అందుకే జీవ వైవిధ్యాన్ని సంరక్షించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ నోడల్ అధికారులు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, గ్రంథాలయాధికారి అజేయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సబ్బుల పంపిణీ



సరకులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరినూనె, ఇతర సామగ్రిని కార్పొరేటర్ బొమ్మిడి రమణ గురువారం పంపిణీ చేశారు. నగరాన్ని శుభ్రంగా ఉంచుతూ, ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్న పారిశుధ్య కార్మికులు వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

రైతుబజారు పరిశుభ్రం

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారును 92వ వార్డు శానిటరీ సిబ్బంది గురువారం ప్రత్యేక డ్రైవ్‌గా శుభ్రం చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలుల వల్ల చెత్త పేరుకు పోయింది. దీంతో రైతు బజారు బయట ప్రాంగణమంతా వారు శుభ్రం చేశారు. దీంతో సిబ్బంది, వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు.

జర్నలిస్టు సంఘానికి వాసుపల్లి ఆర్థిక సాయం



అసోసియేషన్ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జర్నలిస్టులపై మక్కువ.. ప్రేమ కనబరిచే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించడం పట్ల సిటీ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలే ఏర్పడిన అసోసియేషన్‌కు ఫర్నిచర్ కోసం రూ.10 వేలను గురువారం ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో జర్నలిస్టులకు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ వాసుపల్లి గణేష్‌కుమార్ నిత్యం ప్రజలతో ఉంటూ, వారి కష్టాల్లో పాలుపంచుకునే ఆపద్బాంధవుడని కొనియాడారు. వాసుపల్లి మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచే పాత్రికేయులకిచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం నీరు గార్చడం సరి కాదన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి జర్నలిస్టులకు శ్రీకారం చుట్టిన ఇళ్ల స్థలాలు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కనీసం జర్నలిస్టులకు అక్రిడేషన్ కూడా మంజూరు చేయలేని కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల బాధ్యత ఎంతో కీలకమని, అటువంటి వారిని కూడా చంద్రబాబు మరోసారి మోసపూరిత హామీలిచ్చి అమలు చేయలేకపోతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీమంతుల మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రేగిడి రూపగుణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రామాలయం అభివృద్ధికి రూ.1.05 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న నల్లూరి నూకరాజు కుటుంబ సభ్యులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 38వ వార్డు బుక్కావీధి రామాలయానికి వైఎస్సార్‌సీపీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నల్లూరి నూకరాజు రూ.1.05 లక్షల మొత్తాన్ని విరాళంగా అందివ్వడంపై మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అభినందించారు. ఈ మొత్తాన్ని గురువారం వాసుపల్లి చేతుల మీదుగా రామాలయ అభివృద్ధికి నల్లూరి అందజేశారు. ముందుగా మాజీ కార్పొరేటర్ అమ్మాజీ, వైఎస్సార్‌సీపీ ఆర్యవైశ్య విభాగం అధ్యక్షుడు నూకరాజును వాసుపల్లి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడి ఫిషింగ్ హార్బర్ ఎదురుగా వాసుపల్లి రాజు నాయకత్వంలో ఉన్న రామాలయ అభివృద్ధికి నూకరాజు, వారి కుమారులు నవీన్, పుణ్య దంపతులు విరాళం అందజేసినట్లు తెలిపారు. దేవదాయ శాఖ అనుమతిస్తే కురుపాం మార్కెట్ వద్ద ఉన్న శివాలయం, గణపతి ఆలయాలకు కూడా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పడం ఆనందదాయకమన్నారు. వీరంతా జగన్ అంటే నరనరాల్లో అభిమానం నింపుకున్న వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులని కొనియాడారు. ఇదిలా ఉండగా ఎన్ని ప్రభుత్వాలు మారినా రాష్ట్రంలో సంక్షేమం, సుపరిపాలన భారతదేశంలో జగన్ మాత్రమే అందించగలిగారని వైఎస్సార్‌సీపీ ఆర్యవైశ్య విభాగం అధ్యక్షుడు నూకరాజు పేర్కొన్నారు. వాసుపల్లి గణేష్‌కుమార్ వంటి మంచి నాయకులు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమన్నారు. సొంత నిధులతో ఇప్పటికీ ప్రజలకు ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయమన్నారు. ఎంతో ప్రజాదరణ ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి పోలింగ్ మ్యాజిక్ వల్లే ఓడిపోయారని ఇప్పటికీ భావిస్తున్నామన్నారు. గురజాపు రవి, పిల్లి అప్పారావు, సకలా భక్తుల సన్యాసిరావు, ఆకుల శ్యామ్, లండ రమణ, ముజీబ్‌ఖాన్, కోసూరి సురేష్, సారిపిల్లి అరుణ, వాసుపల్లి రాజు, పాటోజు అర్జున్ ప్రసాద్, సాగర్, శ్యామ్, చేపల రాజు, ఆరుగుల రాజు, దూడ తాతారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విజయ దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో శ్రీ విజయదుర్గాలమ్మ



అమ్మవారిని అభిషేకించేందుకు పసుపు, కుంకుమతో నిండిన కలశాలతో బారులు తీరిన మహిళలు

అల్లిపురం: జెండా చెట్టు వీధిలో వెలసిన శ్రీ విజయ దుర్గాలమ్మ అమ్మవారి 24వ ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడి ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో కదిరి గురుమూర్తి దంపతులుచే మన్యుసూక్త హోమం జరిగింది. గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లింగం శ్రీనివాస్, పుక్కల్ల సత్తిరాజు, యల్లయ్యమ్మ, కుమారి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు



బస్సును ప్రారంభిస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడు, అధికారులు

డాబాగార్డెన్స్: సరస్వతీ నది పుష్కరాలకు పయనమయ్యే భక్తుల కోసం ఏపీఎస్‌ఆర్‌టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. విశాఖ నుంచి పలువురు ప్రయాణికులు, భక్తులు గురువారం బయలుదేరగా, జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు ద్వారకాబస్ స్టేషన్ వద్ద ఇంద్ర ఏసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల కోసం ముందుగా సీట్ రిజర్వ్ చేసుకున్న భక్తుల కోసం ఈ బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం, శనివారం ద్వారకాబస్టేషన్ నుంచి బయలుదేరే సూపర్ లగ్జరీ బస్సులకు సంబంధించిన టికెట్లను ఆన్‌లైన్‌లో apsrtc. com వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రయాణికులు పూర్తి బస్సును బుక్ చేసుకోవాలన్నా, విడివిడిగా టికెట్లు కావాలన్నా ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, 34 మంది కలిసి వచ్చినట్లయితే వారికి అనుకూలమైన రోజున ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రయాణికుల కోరిక మేరకు విజయవాడ, యాదాద్రి యాత్రలను కూడా కలిపి ఈ ప్రత్యేక బస్సులను అందించనున్నట్లు తెలిపారు. యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8309265666, 9052227083, 9959225594, 9100109731 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి. సత్యనారాయణ, డిపో మేనేజర్ కె. గంగాధరరావు, అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొని ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు.

జై భజరంగభళి

- వాడవాడలా హనుమజ్జయంతి
- కిటకిటలాడిన దేవాలయాలు



పూజలందుకున్న కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని ప్రసన్న ఆంజనేయ స్వామి



అచ్చియ్యమ్మపేట అభయ హస్తాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

అల్లిపురం: నియోజకవర్గంలో వాడవాడలా హనుమజ్జయంతి వైభవంగా నిర్వహించారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు ఆధ్వర్యంలో విశేషంగా మన్యుసుక్త హోమం చేపట్టారు. కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఆలయ సలహాదారు బొడ్డేటి ప్రసాద్, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, వాసుపల్లి నారాయణరావు, బొడ్డు పోలారావు, సత్యనారాయణ, గణేష్, గనగల్ల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అచ్చియ్యమ్మపేటలో..

అచ్చియ్యమ్మపేటలోని అభయ హస్తాంజనేయ స్వామి దేవాలయంలో విశేష పూజలు జరిగాయి. స్వామికి సింధూర పూజ, లక్ష తమలపాకుల పూజ చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. ఆలయ అధ్యక్షుడు ఆదినారాయణ, మసేను, మౌని తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరమెట్టపై..

వెంకటేశ్వరమెట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నసమారాధన జరిగింది.

నీలమ్మ వేపచెట్టు వద్ద..

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం దేవస్థానం మాజీ చైర్మన్ భీశెట్టి రామారావు, జీకే ఫౌండేషన్ చైర్మన్ భీశెట్టి గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. కణితి బ్రహ్మం, భీశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

మెయిన్‌రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయంలో..

మహారాణిపేట: మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో గురువారం హనుమజ్జయంతి ఘనంగా జరిగింది. స్వామి వారికి పంచామృతాభిషేకం, సింధూర పూజ, తమలపాకుల పూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్వామివారికి పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి..

డాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధిలో గల పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు, అభిషేకాలు జరిపారు.

పూర్ణానంద సమాజంలో..

పూర్ణానంద సమాజంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తమలపాకు, సింధూర పూజలు చేశారు. కార్యక్రమంలో పూర్ణానంద సమాజం ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంబికాబాగ్ రామాలయంలో..

జగదాంబ జంక్షన్ మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో హనుమత్ జయంతి వేడుకగా నిర్వహించారు. ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపటి రాంబాబు, ప్రధాన అర్చకుడు బాలు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

భానోజీనగర్‌లోని ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో..

హోటల్ గ్రీన్‌పార్క్ సమీపాన గల భానోజీనగర్‌లో ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు గోపా జోష్యుల సత్య జగన్నాథ శర్మ స్వామికి పంచామృతాభిషేకం, అలంకరణ, సహస్ర నామార్చన, తమలపాకుల పూజ, సింధూర అర్చన, అష్టోత్తర ప్రత్యేక పూజలు జరిపారు.



అంబికాబాగ్ రామాలయంలో తమలపాకు అర్చనలో ఆంజనేయస్వామి



వెంకటేశ్వరమెట్ట ఆంజనేయస్వామి వారిని తమలపాకులతో అలంకరించిన చిన్నారులు



కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన మన్యుసూక్త హోమంలో పాల్గొన్న వెంకట అప్పలనాయుడు, డాక్టర్ రమణమూర్తి, బొడ్డు పోలారావు



పంచముఖ ఆంజనేయుని అలంకారంలో మెయిన్‌రోడ్డు ఆంజనేయ స్వామి



భానోజీనగర్ ధ్యానాంజనేయ స్వామి

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



జూ పార్కు గేటు వద్ద నిరసన తెలుపుతున్న జూ కార్మికులు, సీఐటీయూ నాయకులు

ఆరిలోవ: విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జూ పార్కు కార్మికులు డిమాండ్ చేశారు. జూ పార్కు జాతీయ రహదారి వైపు ప్రధాన ద్వారం వద్ద గురువారం జూ కార్మికులతో కలిసి సీఐటీయూ మద్దిలపాలెం జోన్ నాయకులు నిరసన తెలిపారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిర్బంధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిటు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇంతవరకు 1,500 మంది కార్మికులను తొలగించడంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు చర్యలు చేపట్టిందని, ఈ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలన్నారు. సీఐటీయూ నాయకులు నరేంద్రకుమార్, జూ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు, నరేష్, పైడిరాజు, నర్సింగరావు, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.